కథా నిలయం
1557
శ్రీకాకుళం

*
* *

—ఫలానానాటికి వస్తూన్నానని, ముందుగా ఉత్తరం వ్రాశాడు. మిత్రులదగ్గరనుంచి, తప్పకుండా... ఎన్నిఆటంకములున్నా వీలుచేసుకుని బయలుదేరిరావలసినదని, జవాబులు కురిసినవి. స్టేషనునుంచి టెలిగ్రాం యిచ్చాడు, రైలులో అడుగుపెట్టబోతూ. దిగినతరువాత... స్వాగతం ఇవ్వడానికి... ఇంత హంగామాతో ఆహ్వానించిన మిత్రులలో... ఒక్కడూ కనబడలేదు:

ఎంతవయసువచ్చినా...తత్త్వములలో ఏమీ మార్పు లేదన్నమాట ! ఇదివరకూ అంతే: వాళ్ళను నమ్ముకుని ఏపనీ తలపెట్టడానికి వల్లనయేదికాదు. అభాసచేయడంలో, మొనగాళ్ళు ! నాటికీ నేటికీ అదేవరుస...

తారకానికి, స్నేహితులు మొగంతప్పించినందువల్ల కోపం రాలేదు, కాని... హుషారీకి అంతరాయము కలిగినందుకు చిరాకు పడ్డాడు. ఎదుర్కొనడానికివస్తే, వాళ్ళనెత్తిన ఎక్కికూర్చుని, వదలడేమోనని ఎవరికివారు మెదలకుండా ఊరుకుని ఉంటారు. వచ్చినవాడు కనబడకుండా ఎక్కడికిపోతాడు... తీరుబడిగా కలుసుకొనవచ్చును కదా అనే దిలాసాతో... వీళ్ళయిల్లు బంగారం కానూ...

—రైలు బందరు సమీపించినకొద్దీ, అతనికి, ఆ సంతోష సమయంలోకూడా... వెనుకటి గాథలు తలపుకువచ్చినవి. అక్కడ గడపిన... అజ్ఞాతజీవనము... ఆనాడు, ఆవరించి... ధ్వంసము

చేసిన నిరాశలు... చివరకు తెగించి... స్వస్థలమనే మమకారము తెంచుకుని... ఆ చవిటిపర్రిలోంచి తప్పించుకుని బయటపడి... నానాఅవస్థలూపడి... తుదకు మదరాసులో స్థాయిచిక్కించుకుని... పేరు... ప్రఖ్యాతి... జీవనపూర్ణశోభలు!...

ఈనాడు... తెలుగువారిలో తారకంకన్న, ప్రఖ్యాతుడు... చిత్రకారులలో... లేడు. ఆతని రచనలు... కళాసృష్టి... విశ్వమోహనమై వెలసినది: ఆతనిని బహూకరించని దేశములు లేవు. ఆతని చెలిమికి గర్వపడని మహామహులు లేరు...

కాని... తారకంతోడివారందరూ, వెనుకటి పాదులోనే... ఎదుగూ బొదుగూ లేక కుదురుకుపోయి... ప్రజ్ఞలను వ్యర్థంచేసుకుంటూ... బందరును విడవకుండా వున్నారు. ఎన్నోవిధాల ప్రయత్నంచేశాడు—ఆ మత్తు వదలగొడదామని,... తనవద్దకు పిలిపించుకుందామని. కాని... కదల్చడం,... వాళ్లని మరమ్మతు చేయడం... బ్రహ్మకైనా తరమా...? అడవిలో కాచే వెన్నెలను పట్టణములమీదకు మరలించడం ఎవరికి శక్యమౌతుంది?... చేతనైన సాహాయ్యముమాత్రం దూరానవుండే చేస్తూండేవాడు.

ఊరు విడిచివెళ్లిపోయేటప్పుడు... ఆ అవస్థమారి ... ఉన్నతమైన స్థితివస్తేనే కాని... తిరిగి చూడకూడదనుకున్నాడు. కాలం గడచినకొద్దీ... అనుకున్నంతకన్న ఎక్కువ పదవికి అందుకున్నా... ఎన్నిమార్లు బయలుదేరి, ఒకమారు... స్వస్థలమును దర్శించవలెనని అనుకున్నా...ఎప్పుడూ, ఏదో అడ్డంకి తగులుతూండేది. పైగా... బంధువులు, నా అన్నవారూలేని... ఏకాకి-బ్రహ్మచారి కావడం మూలాన, రాకతప్పని అగత్యమూ ఏమీ కనుపించలేదు, ఇంవరకూ.

తలవని తలపుగా... తీరిక లభించింది. మైసూరు రాజభవనమునకు చిత్రములు తయారు చేయడం, అనుకున్నంత కన్న త్వరగా అయిపోయింది... అహోరాత్రములూ అదేపనిగా కష్టించ

డం మూలాన, ఎకాడమీకి పంపవలసిన బొమ్మలు మొదలు పెట్టడానికి... ఇంకా వ్యవధి ఉన్నది. ఈ లోపున కొంత విశ్రాంతి తీసుకుని మనసూ చేయీ మామూలు సాఫీలోకి... తెచ్చుకోవడం అవసరం. సరే, అన్నీ కలిసివచ్చినవి కదాఅని... ఇంతలో మిత్రులు రమ్మని ఉత్తరములు దూకించడంచేతనూ... బయలుదేరాడు.

ఊరువిడిచి అయిదారు సంవత్సరములైనా... ఇంకా ఎరుగున్నవారు లేకపోలేదు. ఎవరియింటికి వెళ్ళినా, కాదనరు: నెత్తిన పెట్టుకుని మర్యాదచేస్తారు: కాని, తారకానికి ఆపద్ధతి మనస్కరించ లేదు. పైగా... తాను వచ్చానని తెలియడంతోనే... ఊరివారందరూ విరగబడి... ఊపిరి సలుపనియ్యరేమోననే భయం. అందుకనే కాదూ, కారూ, నౌకరులను ఎవ్వరినీ వెంటతీసుకు రాకుండా అజ్ఞాతంగా వచ్చింది?...అత్యంతాప్తులకు... అతని సహవాసులకు తప్ప ఆగమనవార్త తెలియనీయంది? గుట్టుచప్పుడు కాకుండా, ఉన్న నాలుగురోజులూ, మిత్రులతో సరదాగా గడిపి... తిరిగి వెళ్ళిపోవాలని... అతని ఊహ:

బండి చేసుకుని తిన్నగా 'టి. బి.' కి వచ్చేశాడు. భోజనాదికములు పూర్తిచేసుకుని, ప్రయాణం బడలికతీర్చుకునేందుకు... టీ వేళదాకా విశ్రమించి, అప్పటికికూడా, దొరలు ఎవరూ దిగకపోతే, ఖబురు చేయవచ్చుననుకున్నాడు...

కాస్త, కనుమూశాడో లేదో... ఆ, మిడసర్లగ్నంలోనే... వాళ్ళకు లెక్కా జమా ?... మిత్రమండలి ప్రత్యక్షమైంది. వారు రావడంచూసి... కపటనిద్రను అభినయించి... గిలిగింతలతో బొర్లగిలి, మారాంచేసి... లేచికూర్చుని... అన్నాళ్లకు వాళ్లను చూసిన...సంతోషంలో... మొదటి కోపం మరచిపోయి... వెనుకటి లీలలు జ్ఞప్తికి తెచ్చుకుంటూ, నిర్విచారంగా... పండువుగా... రోజంతా గడిపేశాడు.

సాయంకాలం... కనుచీకటి కమ్ముకుంటూండగా బయలుదేరి... (పట్టపవలు బయటికి రావడానికి తారకం ఒప్పుకోలేదు)... పరిచయస్థలములన్నీ కలియవేసి... విసుగూ విరామంలేకుండా, తిరిగి... తిరిగి, హోటలులో భోజనంచేసి... అలసిపోయినందువల్ల, మరునాడు ఉదయం కలుసుకోవచ్చునని కూడబలుకుకుని... తారకాన్ని జట్కాలోపంపివేసి... ఎవరికి వారు సర్దుకున్నారు...

—పన్నెండు కావచ్చింది. వెన్నెల, బాగా స్వచ్ఛంగా, పులుకడిగిన ముత్యపు జిగి మెరయించుతూన్నది. వచ్చి వసారాలో నడుము వాల్చాడు. ఆనంద పారవశ్యంలో కైపు ఎక్కిపోయిన మనసు... తీయదనం విడిచి... స్వాధీనం కాకుండా... వింతభావములు మొలకలెత్తించుతూన్నది. ఆతని ఆలోచనలు... ఎన్ని పంథాల స్వైర విహారణ చేసినా... చివరకు, తిరిగి... శిల్పారామమున విడియవలసినదే...! వెన్నెల తీవలు, నీలాంబుద శకలములూ కలిసి... చిత్రసామగ్రి అయి... రమ్యాకృతులకు రేఖామూర్తులు దిద్దడం మొదలుపెట్టినవి. ఆతని మానసవీధిని... వెన్నెల... !... అంతా... లోకమంతా... వర్ణసంహారము చేస్తూ... ధాతు వికారమును... ముంచివేసి... తళతళలాడే ... తెల్లని వెన్నెల! ... ఆ... అలవికాని అందాన్ని అంతా... కుంచెకొనల ఏల అమర్చుకొనకూడదూ ...? "బ్లూబాయ్"కి వచ్చిన మెప్పులు... "వెన్నెల కన్నె" ... ఏల అందుకోదు ...?...

—ఆలోచనలకు వశంవదుడైనందువల్ల... లేచినది,... నడచి... బేసిన్ దగ్గరకు వచ్చి... కాలువగట్టున... ఇసుకలో... నడచి పోతున్నదీ... స్పృహకురాలేదు. వెన్నెల వెలుగులో రూపేర్పడుతూన్న... దివ్యమూర్తి... అందకుండా... అందుబాటుగా కనబడుతూ... లాక్కొని వెళుతూన్నది... అందకుండా వెళుతూ...

ఆగిపోయింది...! తారకం... గమనానికి నిరోధముకలిగి... నిలిచిపోయి... తెలివితెచ్చుకుని...

చూశాడు...! కాని... కల ఇంకా నడుస్తూన్నదేమోననే అనుమానం— ఆ అమ్మాయిని చూచి, సమీపించినతరువాతకూడా పోలేదు. సామాన్యయువతి... రూపమోహిని, ఒంటరిగా... అర్థరాత్రివేళ... అక్కడ... నీటిఅంచున ఎందుకు నిలుచుని ఉంటుంది?...

సమీపించడం అలికిడి... ఆ అమ్మాయి ధ్యానమునకు భంగము తెచ్చింది. చూసి, బెదరుతూ... గబ గబ వెనుకకు నాలుగు అడుగులు వేసి... పరుగెత్తబోయి... కాళ్లు ఆడక... కూలపడిపోయింది...

కామినీ గ్రహములను గురించి కథలు అనేకం విన్నాడు. కనుపించుతాయేమోనని... ఎన్నిసార్లో వెదకి... నిస్పృహతో... వట్టిమాటలని తేల్చుకున్నాడు. ఆ విషయాల్లో మొదటినుంచీ ఏమీ నమ్మకము లేదు. భయమనేది ఎన్నడూ ఎరుగడు. అందువల్ల యవ్విధమైన గాభరా ఆతన్ని ఆవేశించలేదు,—ఎవరో... ఎందుకు అక్కడ ఉన్నదో అనే... ఆలోచన పోయినదే తప్ప.

'ఎవరు... నీవు...'

ఆమె, కూర్చుని తలవంచుకుని ఉన్నది. తారకం, దగ్గరగా చేరి నిలుచుని... మీదుగా... ఈలా అడిగాడు. ఆమె, మాటాడకుండా... భయపడుతూన్న దానిలాగు... వణికి పోవడం మొదలు పెట్టింది.

'ఫరవాలేదమ్మా!... నీవు... ఎవరోచెప్పు ...? ఈ వేళప్పుడు... ఇక్కడికి ఏలావచ్చావు...?'

—జవాబుగా... వెక్కి వెక్కి యేడ్వ ప్రారంభించినది. ఆతడు... కూర్చుని, బుజ్జగించుతూ... వీపుతట్టి ... ఝుడఃపుడిగించవలెనని... చూశాడు...

'నేను... నే...ను... చ... చ్చి పోతాను...'

వెక్కుతూ... అక్షరమక్షరం... ఈమాట చెప్పింది. విని, ఆతడు చలించాడు. కాని, అధీరభావము పైకి తొణకనీయకుండా... చులాకనగా... పరిహాసమునకు లాగు... నవ్వేసి—

'మా... ఘనకార్యం... లే! ఇంటికి వెళుదువు కాని. నేను వెంటవచ్చి అప్పగించుతాను. చూడు, ఏలా పండిపోతున్నదో చూడవమ్మా... వెన్నెల...! ఇంతచక్కని వేళ... చచ్చిపోవడం కన్న... వేరే ఏం తోచలేదూ... నీకు ?"

—మాటలు చెపుతూ... అనునయించుతూ, ఆమెను... అనన్యభావంతో... అనాలోచితంగా, చూస్తూన్న కొద్దీ... తారకం... దహరాకాశమున పొడసూపిన వెన్నెలమొన... క్రమంగా మనస్సంతా ఆవరించింది. వెన్నెల తేటలన్నీ కుదించుకుని... ఏర్పడిపోయిన ఆకృతి... ఆమెకు అచ్చంగా ప్రతిబింబంలాగా ఉన్నది. పొంకములై... లాలిత్యము ఉట్టి పడే... ఆ... అవయవ రేఖలను... చిత్రరచనలలో సమకూర్చ గలిగితే... ధన్యుడు...! చిక్కువిడిపోయింది. తలవని తలపుగా... సమకూరిన పెన్నిధిని... ఏల వ్యర్థం చేయవలె...?— అంత చక్కని 'మాడెల్ '...

మనసులోని సంతోషం... ముఖంలో స్పష్టంగా కనబడుతూన్నా... ఆతని ప్రసన్నతను... ఆ అమ్మాయి అర్థంచేసుకోలేదు. అమె గొడవ... ఆలోచనలు... ఆమెవి!

'ఏమమ్మా! లే... యింటికి...వెళుదాము'— అని సంభాషణ మొదలువేయడంకోసం... ప్రయోజనంలేని ప్రశ్న వేశాడు...

'నేను... వెళ్లనండీ...'

'ఏమీ ,..'

'పెద్దపులి బోనులోకి... ఎరుగుండి ఎవరు పోతారు?'

'ఆలాగా... మరి, ఏంచేస్తావు?'

'ఏమైపోతానో... నన్ను విడిచి... మీ దోవను మీరు... వెళ్లండి...'

'అయినా... చెపుదూ... అంతకష్టం ఏంవచ్చింది?'

'ఎందుకులెండి... నా కష్టాలు...'

'కష్టాలు... ఎవరితో చెప్పక దాచేసుకుంటే, మరీ... వేధించుతవి. నామీద నమ్మకంలేదూ...? నేను ఆప్తుణ్ణి అని భావించవచ్చును...'

'మిమ్ములను చూడగానే... మర్యాదస్తులని తోచింది గనుకనే...'

'అయితే సంకోచం ఎందుకూ...? రా...రికామీగా మాటాడుకుందాం. నేను... అదిగో... ఆ బంగాళాలో ఉంటున్నాను. లే, వెళుదాం...'

—ఆ అమ్మాయి... మారుమాటాడకుండా లేచి, తారకం వెంట నడచి వచ్చింది. 'టి. బి.'... హాలులో, ఒక ఈజీ ఛైర్‌లో ఆమెను ఆసీనను చేసి... బలవంతం చేసి... ఫ్లాస్కులోని... టీ... కొంచెం ఆమెకు పంచియిచ్చి... తానూ సేవించి... పాందాను... బల్లమీద, ఆమెకు అందుబాటులో ఉంచి...బ్రైయర్... ధూమదళ ఖండములతో నించుకుని... రగలించి... పొగలు గుప్పున చిమ్ముతూ... మేజాను ఆనుకుని ఆమెకు ఎదురుగా... కథ... వివరములు వినడానికి సంసిద్ధుడుగా ఉన్నానని తెలియజేసే వైఖరిలో నిలుచున్నాడు...

ఆమె... అతని నిదానం చూసి... స్వాస్థ్యం కుదిరించుకుంటూ... మనసు విప్పి... దాపరికం లేకుండా, యావద్వృత్తాంతమూ... విశదీకరించడానికి ఉపక్రమించింది:

'... నాపేరు... సూర్యకాంతం. మా అమ్మ... సాని: మీరు... ఈ ఊరివారైనట్టయితే, పద్మావతిపేరు ఎరిగే ఉందురు.

మా కులమువారిలో, మేమంటే అందరికీ కన్ను ఎర్ర. మా అమ్మ సంపాదన, అనుభవం... ఇంకొకరికి రాదు : మాతండ్రి, యీవైపుల కల్లా పేరు ఎన్నికఉన్న జమీందారుడు. ఇప్పటికి ఆయన చనిపోయి, పదిసంవత్సరాలు అయిందిలెండి:

'చదువూ సంగీతం... విషయాల్లో — మా అమ్మ నాకు ఏమీ లోపం చేయలేదు : ఆవిడ ఇప్పుడు దెప్పటానికి అదే వంక దొరికింది,... ఈ చదువులే ఇంతవరకూ తెచ్చి... ఆమె మాట నేను వినకుండా పోవడానికి కారణమని...

'నేను పెద్దదాన్ని అయినతరువాత, కులవృత్తిలోకి దింపవలెనని... ఆమె ప్రయత్నించితే, నేను ఒప్పుకోలేదు. నాకు, ఆలాటి పాడుబ్రదుకు మీద రోత. ఒకొక్కప్పుడు, మా కులములో తప్పబుట్టినాను అనిపిస్తుంది. మావాళ్లూ ఆలాగే అంటారు:

'మాఅమ్మ, నన్ను ఒక లక్షాధికారి... వైశ్యభల్లూకం పరం చేయుడానికి... తీర్మానించుకున్నది. నేను ఎంత బ్రతిమాలినా వినడంలేదు: ఆమె పంతం చెల్లించుకుని తీరుతుంది: అడ్డుచెప్పేవారు ఎవరూ లేరు. ఆమెను ఎవరైనా ఎదిరించి, బ్రతికి బయట పడడమే...? మా యింటికి, మా అమ్మ... పేద్ధ ముస్సోలినీ...

'మా వీధిచివరను ఒక శాస్త్రిలగారు ఉన్నారు. వాళ్ల పిల్లవాడు... కామేశం అని... మేము ఇద్దరం చిన్నప్పటినుంచీ సావాసంగా ఆడుకునేవాళ్లం: పెద్దదాన్ని అయినకొద్దీ... మేము, కలసి మాట్లాడుకోకుండా... మా ఉభయుల పెద్దలూ కట్టుదిట్టములు చేశారు. ఏం మునుగుతుందో అని వాళ్లకు భయం: కుల గౌరవం...... బ్రాహ్మణీకం ఎక్కడ మంటకలసిపోతుందో అని ఆ శాస్త్రిలుగారు కొడుకును వేయికళ్లతో కనిపెట్టి ఉంటూన్నాడు:

'మా అమ్మకు కామేశమంటే అసలు సరిపడదు. అందంగా వుంటేమాత్రం... మంచివాడైతేమాత్రం... లక్షాధికారి కానప్పుడు,

తన కూతురుమీద కన్ను వేయడానికి ఒప్పుకుంటుందా?... ఆతనేదో బ్యాంకులో గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు: వాళ్లకు స్థితి ఏమీ లేదు......

'నేను కలుసుకునేందుకు వీలులేకపోయినా... నేను పడుతూన్న బాధలన్నీ ఆతనికి తెలుసును. తెలియదూ... లోకానికి? ఈలాటి విషయాలు ఎంతదాచినా గుప్పుమంటాయి: అందులో, సానికొంపకు... రహస్యమా?...

'కీరపండరి ఉత్సవాలకు... మేము ఓనాడురాత్రి చూడటానికి వెళ్లాము: అక్కడ కామేశం కనిపించాడు: చూడగానే నాకు ప్రాణం లేచివచ్చింది: మా అమ్మా వాళ్లూ విఠల్ భజనలో మగ్నులై ఉండటం మూలాన, నేను ... ... లేచి, ఆతని దగ్గరకు వెళ్లాను: నన్ను గుర్తించి... చూసినట్టు ఆతడూ సైగ చేశాడు లెండి!...

'చంద్రభాగ ఆవలివేపుకు తిరిగివెళ్లి... అక్కడ కూర్చున్నాం: నాకథ అంతా చెప్పాను: ఎలాగైనా... ఈ చెరతప్పించమని...... ఎక్కడికన్నా తీసుకువెళ్లిపొమ్మని ...... బ్రతిమాలుకున్నాను. పెళ్లిచేసుకుని ఆతనితోనే ఉండిపోవడం నానిశ్చయమనీ... ప్రేమ ఉన్నదనీ, కామేశానికి తెలుసును: నేనంటే ఆతనికీ చాలా యిష్టం:

'అంతావిని, అప్పుడు చెప్పాడు ఆతను...: నా విషయమంతా తెలుస్తూనే ఉన్నదనీ ... ...పెద్దలచాటువాడు కావడంచేత ధిక్కరించి...అఘాయిత్యం చేయడానికి జంకుతూన్నాననీ..., కాని, సమయంచూసి ... ఏదో ఉపాయం ఆలోచించి ... రక్షించేభారం తనదనీ... నేను ధైర్యం వదలకుండా... తనమీద నమ్మకముంచి... కొంతకాలము ఓర్చుకుని ఉండవలసిందనీ... ఎంతో ఖరారుగా చెప్పాడు ..

'మేము, కలసి మాట్లాడినసంగతి, మావాళ్లకు... ఏలాగో మర్నాడు తెలిసింది: కనికరం లేకుండా, మాఅమ్మ నన్ను చావా చితుకాకొట్టింది: వాళ్ల నాన్న... అంతకన్నా పై ఎత్తు ఎత్తాడు: అధికారుల ప్రాపకం ఉన్నది కాబోలు... నిలుచున్నవాడికి నిలుచున్నపాళంగా... కాకినాడ బదిలీ తెప్పించి పంపేశాడు: ఊరుదాటిందాకా... ఎక్కడ నాతో కలుసుకుంటాడో అని... విడువకుండా వెంటాడే ఉన్నాడట:

'ఇప్పటికి... నెలరోజులు అయింది... కామేశం ఖబురు ఏమి తెలియదు: ఆతడు రాలేదు,... ఉత్తరం వ్రాసి ఎవరిచేతనైనా పంపనూ లేదు: నిరాశ చేసుకుని ఊరుకున్నాడో,... లేక, ఈ రభస అంతా ఎందుకు అనుకుని... నా మాట మరచి పోదామనుకున్నాడో... ఏమో.

'ఇవాళ వరకూ, అవతల ఓమూలనుంచి ముంచుకు వస్తున్నా... ఇంకా వస్తాడు... ఇంకా వస్తాడు... అని... కామేశం కోసం ఎదురు చూశాను: ఈరాత్రే నేను... షాహుకారుకు బలి కావలసిన సుముహూర్తం: ఆ నరపశువుకు... నేనెంత బ్రతిమాలినా కనికరం పుట్టదు గద...! బోలెడు సొమ్ము వ్యర్థం చేసి... నామాటలు విని... విడిచి వెడుతాడా?... ఇక మా అమ్మ,— ఆ నల్లరాతిలో... దయా దక్షిణ్యాలా?...

'ఎవరూ చూడకుండా... తప్పించుకుని, సందు దోవను... తిన్నగా... ఏలావచ్చానో?... ఆ మసీదు దగ్గర కూర్చుని... చాలాసేపు... గుండెపగిలేటట్టు ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి పడిపోయినాను: లేచి... ఆ కాలువలోపడి పోదామని... నిలుచుండగా... మీరు వచ్చారు. నేను... ఎందుకు బ్రతకాలి చెప్పండి...?'

ఆ అమ్మాయి కథ వింటూన్నకొద్దీ... అంతసేపూ... తారకానికి ముఖంలో నవరసములూ... మధ్యమరసం మినహాగా... తర

ళించినవి. ఆమె చివరి ప్రశ్నతో... బాగా... చలించిపోయి... కళ్లనీళ్ళు తెచ్చుకుని... ఆమె చూసి కలవర పడుతుందేమోనని... సంభాళించుకుని...

'ఎందుకు బ్రతకాలా?... ఎందుకో అర్థమౌతుంది... నేను చెప్పినట్టు చేస్తావా?'

'అంటే...'

'నామాటమీద నమ్మకం ఉంచడం...'

'ఆ విషయం తర్కించడమల్లా... మీరు నామనసుకు బాధ కలిగించడం...'

'అచ్చా... ఉదయం బయలుదేరుదాం'

'ఎక్కడికి...'

'చెప్పితీరాలా...'

'క్షమించండి... తెలియక అన్నాను. దానికేమీ అర్థం లేదు...'

'అర్థం తీసేందుకు నేను ఒకడిని దొరికాను కాదూ...! బస్... కొంచెంసేపు నిద్దుర తియ్యి...' ఇంకా మొగమాట మేనా...? ఎగిరివెళ్ళి... నేను చెప్పేటప్పటికల్లా... ఆ మంచంమీద పడాల్సిందేకాని...'

'మరి... మీరు...'

'నాకు... నిద్ర బొత్తిగా సరిపడదు... ముందు ముందు నీకే తెలుస్తుంది కాదూ ...నేనుచెప్పడంఎందుకూ... యిప్పుడు...?'

ఆమె... తెగ అలిసిపోయి హైరాను అయి ఉన్న మూలాన... తలగడాకు... తల తగులగానే... కలలులేని నిదుర లోకి వెళ్ళిపోయింది. తారకం పైప్ విసిరివేసి... మరి రవంత టీ గుటకవేసి... సిగరెట్ ముట్టించాడు...

ఉదయం... సౌఖ్యాయనికులుగా మిత్రులు ... టి. బి. కి వచ్చేటప్పటికి ... బాయ్... తారకం ఇవ్వమన్నాడని ఒక ఉత్తరం అందించాడు: చదువుకుని, ధోరణి అర్థంకాక...... అంత అగత్యంగా వెళ్ళిపోవలసిన తొందరపని... ఏం జ్ఞాపకం వచ్చిందా అని, వాచరుకు సంగతి యేమైనా తెలుసునేమో అని ... (టి. బి. వాచరుల తత్త్వం తెలియదేమో) ... రకరకాల ప్రశ్నలువేసి ... ఏదీ తేల్చుకోలేక... హతాశులై తిరిగి వెళ్ళిపోయినారు, విధిని నిందించుకుంటూ:

—రైలుకు బయలుదేరితే, అందుకోడం కష్టమౌతుందేమోనని టాక్సీమాట్లాడుకుని...... బెజవాడలో, ఎక్స్‌ప్రెస్, కేచ్ చేసి... దీపాలు పెట్టిన తరువాత మదరాసు చేరుకున్నాడు,— తారకం ఆ అమ్మాయితో సహా. ప్రయాణం చేస్తూన్నంతసేపూ... సూర్యకాంతం తగని దిగులుతో... భయంతో... ఏమీమాటాడకుండా... ఒకమూలను ఒదిగికూర్చుని... కాస్సేపు పడుకుని... అలా ఏకాంతవాసమే చేసింది. భోజనం... ఊరికే ఎంగిలిపడి లేచింది.

తారకం... ఆమె ధోరణి కనిపెట్టి... ఆట్టే మాటాడించకుండా... ఆ అమ్మాయి చూనాన ఆమెను వదలిపెట్టి... 'స్టాల్' లో కొని తెచ్చుకున్న పత్రికలు ముందు వేసుకుని పొద్దుపుచ్చాడు.

బేసిన్ బ్రిడ్జినుండి ఫోను చేసినందువల్ల... సెంట్రలులో దిగగానే... కారు సిద్ధంగా ఉన్నది. నౌకరు, డ్రైవరూ, నమస్కరించి...వినయంతో సమీపాన నిలవబడినారు:

సామానులు...వేరే బండి కుదిర్చి యింటికి పట్టించమనీ... ఇంకా గృహకృత్యపు విషయాలూచెప్పి, వాళ్లను పంపివేసి... కారులో, సూర్యకాంతమును వెంటవేసుకుని...పురవైభవం...విద్యుత్కాంతులజాడను...ఆమెకు కనువిందు చేయవలెనని...బయలు

చేరి...తిరిగి బీచికి వచ్చి......చల్లనిగాలి అనుభవించుతూ, కారు నెమ్మదిగా నడపించుతూ... తొమ్మిదిన్నరకు స్వగృహప్రవేశం చేశాడు.

సూర్యకాంతం, పుట్టి పెరిగిన తరువాత...మదరాసు...అదే తొలిసారి చూడటం. పవలు కామగనుక... దీపకాంతులలో... నీడలలో...పట్టణ సౌభాగ్యంచూసి విభ్రాంతి చెందినది. ఆ విస్మయంలో ఉండగానే...తారకం యింటికి రావడం! భాగ్యవంతురాలైనా... ఎన్నడూ బందరు విడిచి రానందువల్ల... ఆ యిల్లు చూడగానే... కథలలో చదువుకున్న... ఇంద్రభవనం ప్రత్యక్షమైనంత ఆశ్చర్యం పొందింది. తారకం మాటా మర్యాదా చూసి సమ్మకస్థుడైన ఎవరో పెద్దమనిషికదా అని అనుకున్నదేకాని... ఆతన్ని గురించిన వివరములు ఏమీ... సంభాషణలో రానందువల్ల తెలుసుకోలేదు. చూసి... చూపులను నమ్మలేక, కలా నిజమా అనే దిగ్భ్రమను... ఆమె కవళికలో కనిపెట్టి, తారకం—

'ఏం సూర్యుడూ! మన... యింటికి వచ్చిన తరువాత కూడా ... ఇంకా నిదురమత్తేనా...? ఒరే ముత్తూ, అమ్మాయి... స్నానం చేస్తుంది... కుప్పమ్మను ఇలా పిలు...' — అని... ఆమెను హెచ్చరించి, కర్తవ్యం ఉపదేశించి... తనగదిలోకి వెళ్ళిపోయినాడు.

— తరువాత, భోజనం చేయడానికి... వచ్చి బల్లదగ్గర కూర్చున్నాడు. సూర్యుడు... మానస సరసిలో జలవిహారం ముగించి, బయలువెడలి మందగమనపు టొయ్యారంతో నాయకుని దరియవచ్చే రాజహంసిలాగా తోచింది, తారకం కళా భావనలో. షాంపూ చేసి, తడి ఆరనందువల్ల తలకట్టు నొక్కులు లేక కుండా, పట్టులాగా ఒత్తుకొనిపోయి ఉన్నది. లోలాకులు, చీరె... మార్చేసింది:

ఆమెను చూడగానే... తారకం లేచి నిలుచుని, ప్రక్కను ఉన్న, ఆసనమును నిర్దేశించినాడు. వెంటనే కూర్చోకుండా, కుర్చీ

చేతిని ఆనుకుని, అర్థ త్రిభంగిలో పోజుయిస్తూ... నేను అందంగా ఉన్నానా, లేదా ... అనే ప్రశ్నను చూపులలో మెరిపించింది. జవాబుగా, తారకం చట్టున లోపలికి వెళ్ళి, 'స్కెచ్ బుక్' తో తయారై, కుర్చీమీద కాలూని, మోకాలిమీద, పుస్తకం ఆన్చి, గబగబ... ఆమె నిలుచున్న పాళాన... 'లైట్‌నింగ్ స్కెచ్' గీశేశాడు —

అంతా కొత్త గనుక, ఆమె కదలకుండా, ఆశ్చర్యపడుతూ, అలాగే ఉండి పోయింది. భోజనసామాగ్రి అమర్చడానికి, వచ్చిన నాయర్... (ఆతనికి అది అలవాటైపోయింది)... యజమాని చేస్తూన్నపని గమనించి, సద్దుచేయకుండా, వెనుకకు తప్పుకున్నాడు.

స్కెచ్ పూర్తిచేసి, తన నిర్వాహకత్వమును... ఒకమారు పరకాయించి చూచి... మురిసిపడి, ఆమెవంక, బింబప్రతిబింబము లను సరిజూసుకుంటూన్నట్టు సమీక్షచేసి... తృప్తిపడిన భావ ముతో... కాగితమును అందిచ్చాడు. ఆమె... దాన్నిచూస్తూ, కలగంటూన్నదానివలె... నిజముగా... ఆ రేఖామూర్తిని చిత్రీకబ లితము చేసినది తన ఆకారమేనా...... అని నమ్మలేకపోతూ, మెచ్చుకుంటూన్న ముఖకళలు మొలకరించుతూ ... చూపు, బొమ్మమీదనుంచి తిప్పేసుకోలేని... పరవశ అయిపోయింది.

ఫైలును, స్టాంప్‌ను బల్లమీద పడవేసి... తారకం, ఆ అమ్మాయిని రెప్పవేయక కాంచుతూ, ప్రశంసోపాయనమును అందు కొనడానికి సంసిద్ధుడై ఉన్నాడు...

'చాలా... బాగున్నది.'

'అవును... నీ చక్కదనం పంచుకున్నప్పుడు ఆమాత్రంగా నైనా... లేకపోతే,...'

'నేను... ఇంత అందగత్తెనా !...'

'చెపితే నమ్మవనే... సాక్ష్యం తయారుచేసింది ...'

ఇద్దరూ... నవ్వుకుంటూండటం కనిపెట్టి, నాయర్—అభ్యంతరం తీరినదని... వచ్చి వడ్డించాడు. తీరికగా, ఖులాసాగా ఆకబురూ యీకబురూ చెప్పుకుంటూ భోజనంచేసి... ఆకుమడుపులు అందుకుని... డ్రాయింగ్ రూమ్‌లోకి... మారారు. రేడియోలో, సింగాలీనాటకం, కొలంబోనుంచి... కొంతసేపు విని... సూర్యుడు, నిద్రకూడుకు వస్తూండగా, ఇక కూర్చోలేక, లేచి... వెళ్లిపోయింది— పరిచారిక దోవతీయగా. తారకం, అవిరళంగా, ధూమహోమంచేసి... (ఆలోచనలో ఉన్నప్పుడు... చేతిలో సిగరెట్ ఆరకూడదు— అది ఆతని అలవాటు)... క్రమంగా... అక్కడే నిద్రలో పడిపోయినాడు.

తెల్లవారుతూందనగానే, సూర్యుడు, కొత్తచోటుగనుకనూ, మనసులో బెరుకు ఇంకా తీరనందువల్లనూ, సరిగా నిద్రపట్టక... లేచి, తోటలోకివచ్చి, ప్రభాతమలయాంకూర సాహచర్యమున బడలికలు తీర్చుకుంటూ, షికారు చేస్తూన్నది. ఒకప్రక్కనుంచి, కడవలు పట్టుకుని, గులాబీపొదలవేపు వెళుతూన్న తోటమాలి, ఆమెను చూసి, చేతనున్నవి క్రింద అన్చి... గోరుకోపువ్వుగా త్రుంచి... కాడలతో గుదిగా కలిపి పట్టుకుని వచ్చి... 'బొకే'...ను అర్పించి, నమస్కరించి, వెంటత్రిప్పి...తోట అంతా చూపించాడు. కుప్పమ్మ, పూలసజ్జ పట్టుకొని అక్కడకే వచ్చింది. సూర్యుడు దానిని అందుకుని... వనకన్యలాగా... బాలహరిణాంగనలాగా... ఉత్సాహంతో... విలాసంతో పుష్పాపచయంచేసి... ఉబికిపోయేటట్టుగా పూలబుట్ట నింపుకుని, తిరిగి యింట్లోకి వచ్చి... వాజ్‌లన్నీ తనచిన్నారి చేతులతో, అమర్చి... మార్బుల్ పెడస్టల్ మీద నున్న అవలోకితేశ్వరుని పాదముల దగ్గర మందారముల బారుతీర్చి... భక్తి వినమ్రకావడం...

—స్నానాదికములు పూర్తి చేసుకుని, డ్రెస్సింగ్ గౌనుతో, పైప్ రగులుస్తూ అక్కడకు అడుగువేసిన... తారకం కంటబడ్డది. ఆతడు, ఛలోక్తిగా—

'ఎరుగని దేవులకు మ్రొక్కకూడదు...' అని, విసిరాడు :

సూర్యుడు... గుక్క తిప్పుకుని, ఆతనికన్నా కొంటెగా...

'ఎరుగనివాడైతేనేం... నమ్మించే నేర్పుఉన్నప్పుడు... తప్పౌతుందా...'— అని, తిప్పికొట్టింది. చక్కనిదేకాక... ఇంత తెలివితేటలుకూడా ఉన్నాయా ఈమెకు... అని తారకం ఆశ్చర్యపడ్డాడు.

కాఫీకప్పులు అందుకుని... నిలుచునే త్రాగేశారు. టాయలెట్ విధానం పూర్తిచేసుకుని... మళ్లా స్విష్టకృత్‌గా కడుపునింపుకుని... ఊరిలోకి, బయలుదేరి వెళ్లిపోయినారు :

పెద్దపెద్ద షాపులకు వెళ్లారు. ఎక్కడచూచినా, తారకానికి అమితగౌరవం జరగడం... అందరూ, చేతులుకట్టుకుని... కనుసన్నల ఆజ్ఞలు నిర్వర్తించడానికి సంభ్రమించడం... ఇదే అసలు సూర్యుడికి... తగని వింతగా వున్నది. ఇక కొన్న సామానులకు అంతూ బొంతూ లేదు : కోటీశ్వరుల ఫాయీలోనివాడా ఏమి టనిపించింది, ఆమెకు. కొన్నవాటిలో, అన్నీ సూర్యుడికోసమే...! ఆతను పురమాయించడం, ఆమె, చేసే దేమీలేక... సరే నని తల ఊగించడం. నిజానికి, మనసులో, తనకోసం అంతసొమ్ము ఆతడు వెచ్చించడం చూడగా, కొంచెం కష్టంగానే ఉన్నది : కాని వద్దంటే, తారకం యేమనుకుంటాడో, ఆతని దర్జాకు ఎక్కడ లోపం చేసినది అవుతుందోనని, కిక్కురుమన లేదు :

ఒకటి రెండు రోజులు, తయారై వచ్చిన నగలను, దుస్తులనూ... కరవుదీరా చూసుకోవడంలో సూర్యుడికి ఊపిరి సలుపడానికైనా, తీరిక లేకపోయింది. సాయంకాలము... షికారుకు, ఏదో మంచి పిక్చర్ ఉంటే... సినీమాకు, మర్నాడు కాబోలు, ఆతని బలవంతాన వెళ్లింది...

పవలు... చదువుకునేందుకు... వినడానికి, చూడటానికి... ఆ దివ్యహార్మ్యమునిండా, అమూల్యసాధనాలే. ఒక్క నిమిషమన్నా, ఏమీ తోచక పోయేందుకు వీలులేదు. ఎన్నిరకాల ఆర్టు గ్రంథములు... ఎన్ని విగ్రహాలు, పెయింటింగులు... ఎన్ని... వాద్య పరికరాలు... పియనోలా, వీణె... జితార్... ఎన్నో...

అస్తమానం...అదొక పుణ్యతీర్థములాగా, ఎవరో ఒకరు వచ్చి పోతూండటానికి, విధీ విరామమూ లేదు. వచ్చినవారందరికీ... చాలాభాగం అప్తులే కావడం మూలాన...తారకం, ఆమెతో దోస్తీ చేసేవాడు. కొన్నాళ్లకు, అతన్ని ఎరుగున్నవారందరూ... ఆమెతోనూ, చనువుగా మాట్లాడుతూండేవారు. కులమర్యాద అయితేనేం... అభిజాత్యలక్షణముకానీ... సూర్యుడు, ఆ బృందంలో కలసిపోయి... గౌరవ మందుకునేందుకు ఎంతో కాలం పట్టలేదు.

ఇంటిలో, నౌకరులందరూ, యజమానితో సమంగా... ఒక్కొక్కప్పుడు అంతకన్నా ఎక్కువగా ఆమెను మన్ననగా చూస్తున్నారు. ఎవరి మనసునైనా వశము చేసుకోగల...వెన్నతో బెట్టిన ప్రక్రియ... అనుభావసరములలో... ఆమెకు ఎంతో చేయూత అయి, అక్కరకు వచ్చింది:

— తారకం... నిమిషం, ఏమారకుండా... ఆమెను ఎంతో అపేక్షగా చూస్తున్నాడు. సూర్యుడికి... కొత్త అంతాపోయింది: అతిచనువుగా, పెంకెమారాములు చేస్తూ... అన్నలు లేని కొరత నంతా తీర్చుకుంటూన్నదేమో అనిపిస్తూన్నది. నిర్మలమైన వాత్సల్యం: మనస్సులో మాట దాచుకోదు. పరాయివాడుకదా అన్న స్ఫురణకూడా లేదు...

ఎన్నోరకాల... ఎన్నోవేషాలతో, ఆమెమూర్తిని చిత్రించాడు: అహోరాత్రములూ, ఆదీక్షలోనే తన్మయుడై ఉన్నాడు. పూర్తి అయిపోయిన చిత్రశిల్పమును... ప్రదర్శించినట్లయితే...

కళారసికులు... ధనరాసులు దిమ్మరించుకొని... లభ్యంచేసుకుని, గేహలక్ష్మికి అమూల్యాలంకార సంపదను ఘటియించుకునే వారే... సందేహము ఏమాత్రమూ లేదు— కాని, ఇటీవల, తారకం, ఇంకో పురుగునైనా, స్టుడియోలోకి రానీయడంలేదు: మోడల్సుగా, ఇతఃపూర్వము ఉపకరించిన విలాసినులకు... ఇప్పుడు అతని దర్శన భాగ్యమే కరవై పోయింది: వారితోడి ప్రసక్తి లేదు.

—అతనికి... ఈ చిత్రములన్నిటిలోనూ, కొరత ఏదో కనబడుతూనే ఉన్నది. మనసులో ఆందోళనను, నిలువ ద్రొక్కు-కునేందుకు... కుంచెలకు తీరిక లేకుండా చేశాడేకాని... చిత్రింప వలసిన విశిష్ట-మోహన-భావనను... ఇంకా వర్ణాంకితము చేసి, రూపేర్పరచడానికి... పూనుకోనేలేదు. అందుకు, కారణం... సంకోచించడము చేతనే...

— ఆనాడు, ఉదయం... సూర్యుడు, స్టుడియోలోకి... మామూలు ప్రకారం వెళ్ళింది: తారకం, పేలెట్‌ను గీకి శుభ్రపరస్తూన్నాడు...

—చేస్తూన్న పని ఆపి, తలఎత్తి, ఆమెవంకచూసి... ఏదో తేల్చుకున్నవాడిలాగా... నిశ్చయంతో... ధీరస్వరంతో...

'సూర్యుడూ... తలుపు గడియవెయ్యి...' అన్నాడు. ఎందుకో, ఆమెకు బోధపడలేదు. ఆవైపులకు, అనుమతి లేనిదే ఎవరూ రావడానికి వీలు లేదు. నౌకరులు మాట్లాడటానికి... ఫోను ఉన్నది: ఎంత పరిచయస్థులైనా... యకాయకి అక్కడికిరారు: నౌకరు రానీయడు...

ఏమో, చెప్పాడుకదా, అని, అర్థంకాకుండానే, ఆజ్ఞను పాలించింది.

'ఇలా-రా'

సమీపానికి, బెదురుతూ వచ్చింది. మనిషిలో మార్పు ఏమీ కనబడకపోయినా, ముఖం ప్రసన్నముగానే ఉన్నా... ఏదో, ఒక విశే

షము ఉండిఉండాలి. ఇదివరకు, సంభాషణలలో, ఇంత గంభీరంగా ఆతడు ఎన్నడూ ఉండలేదు.

'కూర్చో'

—కూర్చున్నది. ఆలోచించుకునేందుకు కూడా వ్యవధానం ఇవ్వడంలేదు. చూపులతోనే, ఆమెను కీలుబొమ్మను చేస్తూన్నాడు. మంత్రముగ్ధలాగా, చెప్పినపని... చేయడమే:

సమీపించి... సూర్యుడికి ఎదురుగా కొంచెం దూరంలో నిలుచున్నాడు... తారకం—

'నేను—నిన్ను రక్షించిన మాట—మరచి పోలేదుకదా?'

'ఈ జన్మకు- మరవడమే! మీ ఋణం, ఎలాతీర్చుకోడం ?'

'ప్రత్యుపకారం చేసి...'

'చెప్పండి: మీ మాటకు నేను కాదంటానా'

'బాగా ఆలోచించుకో'

'అదేమిటి...ఆలా అంటున్నారు'

'చెప్పనా'

'సంశయించడం ఎందుకూ, ఏం కావాలి...'

'నీ—శరీరం—'

'ఆఁ—'

'నీ—చక్కదనం—నాకు కావాలి'

ఇంకా అర్థం కాకుండా ఉంటుందా, సూర్యుడికి? చివరకు, ఇదా, పర్యవసానము...? కళాజీవనము- ఈ ఖబుర్లు...అన్నీ అబద్ధమేనా-? ఆతనికీ, కావలసింది తనశరీరము! ఇంతకాలంనుంచీ... లాలనచేసింది, ఇందుకోసమా-? ధనమిచ్చి వశము చేసుకుందామనుకున్న షావుకారు బారినుంచి తప్పించుకు వచ్చింది ... ఈ సింహం

నోట చిక్కుకుని పోయేటందుకా ?... ఈతనిలో మాత్రం తేడా ఏమున్నదీ ?... కలిగిన వాడుకనుక, డబ్బు లక్ష్యం చేయకుండా... తన విలాసమునకు ఉపయోగించుకునేందుకు... కొనుక్కున్నాడా ?

మనసులో యాతన, ముఖకవళికలో... తారకం గుర్తించక పోలేదు ; కాని, వెంటనే ఆమె ఆలోచనలకు చేయూతనిచ్చి చిక్కు విడదీయకూడదు. ఆమెకు సంబంధించిన విషయమును నిర్ణయించుకునే బాధ్యత, మంచిచెడ్డలు ఆలోచించుకోవడం ... ఆమెకే వదిలి వేయాలి. కాని, మాటల్లోమాత్రం, ఏదో నిశ్చయమునకు తరుముకు వెళ్లాలి...

'ఏ మంటావు ?'

'మీకు... న్యాయమా'

'ఏమీ'

'మీరు... ఎంతో మంచివారు. ఆపదనుగడపి గట్టెక్కించుతారనే నమ్మకంలో, భక్తితో, మీ వెంట వచ్చాను. ఇప్పుడు నడియేట మునగమంటూన్నారు'

'ఆలా అంటూన్నానా ?'

'ఎందుకు అంటారూ ? దోవచూపించుతున్నారు. ఇంత కాలం మీ మనసు స్వచ్ఛమైనదనుకున్నాను.'

'రైట్...'

'అప్పుడే ఎందుకు... పడిపోనిచ్చారుకాదు ? బ్రతికించింది ఇలావంచన చేయడానికా... ? ప్రాణం పోయినా ... తాకనిస్తానా... ? నేను...ఎవరిననుకున్నారు ?'

— కోపంతో ముఖం జేవురించిపోయి, ఝంఝూక్షుభిత మైన నవ వల్లరిలాగా ఆమె కంపించి పోతూండగా... తారకం,... తుపానుకు అడ్డుతగలాడు—చిరునవ్వుతో...

'నీవు పొరబాటు పడుతున్నావు'

'కాదు,—కల గని మేలుకున్నాను'

'ఎంత కవిత్వం ఉన్నదమ్మా నీలో!...అందుకనే, నాకాంక్ష మరీ వృద్ధి అవుతున్నది...'

'మీతో మాటాడటానికే— నాకు అసహ్యము వేస్తూన్నది. ఇక...ఇక్కడ ఉండకూడదు'

'ఎక్కడికి ప్రయాణం'

'సముద్రంలోకి...'

'కాదు- కాన్వాస్ మీదికి...వర్ణ చిత్రిలోకానికి... ! పిచ్చిదానా... ఎంత తల్లడిల్లి పోయినావు... ! నిన్ను కామించి నాననుకున్నావా?... శారీరక వాంఛ...ఆ, సుఖమనుకున్నావా నేను కోరింది...? నీ రామణీయకాన్ని... సహజశోభలలో... వన్నెల దిద్దుదామని...'

'అదా...'

'అప్పుడే తేరుకోకు. నేను అడిగేవరం...? నీవు... సహజంగా... వస్త్రరాహిత్యంగా...'

'ఆఁ... ఆఁ... ఇది ఇంకొక ఎత్తా...? మీ ఎదుట సిగ్గు విడిచి... నగ్నముగా నిలిచిపోవాలా ?'

'సిగ్గు... నా ఎదుట ఎందుకమ్మా...? రేఖల పొంకమునే కాని, నాకన్నులు నీ శరీర సౌష్టవమును చూడవు. దేవీమూర్తులను అర్ధనగ్నలుగా చిత్రించే శిల్పి హృదయంలోని పవిత్రభావననే... నేనూ వరముగా అర్థిస్తూన్నది: వయసు తెచ్చిపెట్టిన మాయ సిగ్గును- పసిదానవై పోయి... మాయం చేసుకో...'

'సరే...'

'మనసులో యిష్టములేనిదీ...సరే అననద్దు...'

'మీ మనసును కష్టపెట్టడం...'

'నీవు పెంకెతనం చేస్తున్నావని కాదు—ఈ మూలాన... కళాసృష్టికి కొరత వస్తుందేమోనని...మనసులో కష్టం...'

'ఎంత... తెలివిగా మాట్లాడుతారండీ...'

—కలతదీరి, సుఖంగా నవ్వుతూ ... నవ్వుతూనే, కట్టిన చీరె...రవికె...తొలగించి...అరమరిక లేకుండా దివ్యాంగనలాగా శోభతో...నిలిచిపోయింది...

తారకం...భంగిమమును నిర్దేశించి...అదివరకే సిద్ధము చేసుకుని ఉన్న ఈజెల్‌ను ... ఉచితస్థలమున అమర్చుకుని ... రచన ఆరంభించాడు.

—దినములు గడచిపోతూన్నవి. చిత్రము క్రమముగా, మూర్తిమంతమై...చైతన్యభ్రాంతి నలవరచుకుంటూన్నది...

సూర్యుడు ... స్టుడియోలో పని లేనప్పుడు ... సంగీతమును వృద్ధిచేసుకుంటూ, పియానోలో ఆరితేరి...కళాసాంకేతికములను అర్థంచేసుకుని ఆనందించే రస-పాండిత్యం తారకం చిరసహయోగము మూలముగా ఆర్జన చేసుకుని...ఆ విద్ధహీరమణిగా మెరుగులు దేలింది...

'వెన్నెలకన్నె'...చిత్రము పూర్తి అయిపోయినది. పాద సమీపతలమున ... అర్ధచంక్రమణమున క్రిక్కిరిసిన...లేతనీలి— మేఘాంతరగలు - వాని అంచున పసిమి కలిసిన మెరుగు చెంగావి రేఖలు... మిగతా అంతా, చిగురుపచ్చ ఈనెలతో...వెన్నెల... ఆకాశనీలిమను బింబించుతూ... వెన్నెలలేకమై ... నిలిచిపోయిన... దివ్యమూర్తి...కైశ్యములో ... చెంపలదగ్గర ... అన్నిరంగుల తళతళతో...అలంకారమాలికలుగా...నక్షత్రములు...

—చివర నగిషీలు అయిపోయిన తరువాత ... తారకం ... మిత్రులనందరినీ విందుకు ఆహ్వానించి, చిత్రమును ప్రదర్శించాడు.

చూసినవారికి...ఉచిత ప్రశంసకు అనువైన శబ్దజాలము లేక...మ్రాన్పడి...ఆలాగే...అనిమిషులై పోయినారు:

ప్రజాసామాన్యమునకు కూడా చక్షుస్సాఫల్యత కలిగించక తప్పదని...మరీ సన్నిహితులైనవారు మొగమాటపెట్టడం చేత, తారకం... 'వెన్నెలకన్నెను' ఎక్జిబిట్ చేయడానికి అంగీకరించాడు. సౌందర్యమహాలులో...ప్రదర్శనము మొదలుపెట్టిననాటినుంచీ...ఆ వీధిని మనిషీ మనిషీ మెసలడానికి వీలులేనంత జనసమ్మర్దమై పోయింది...

వారము...ఇంకో వారము...ఎన్నాళ్లు అక్కడ ఉంచినా...చాలునసేటట్టు లేదు: తారకానికీ సర్వజనాంగీకారమునగాని, ఎక్జిబిషన్...ఆపివేసే మొరటుతనం లేదు...

సూర్యుడు ప్రఖ్యాతి...తారకం ప్రతిష్ఠనుకూడా మించి పోయింది. ప్రసిద్ధ సినీమా తారలకన్న ఇనుమిక్కిలి...ఆమె ఎక్కడకైనా బయలుదేరిందని కాని...వచ్చిందని కాని, తెలియడం వ్యవధానం...జనం విరగబడేవారు. అందు చేత, మునుపటిఅంత స్వేచ్ఛగా విహరించడానికి, తలచినప్పుడల్లా షికారు వెళ్ళడానికైనా, వీలులేక పోవడం...చాలా చిక్కుగానే ఉన్నది, మొత్తానికి.

సినీమాలోకి తీసుకువెళ్లవలెనని ... ఎందరో పెంపరలాడుతున్నారు: ఆమెకు...తారకం, హుషారీ యివ్వకపోవడం మూలాన ...అవుననీ, కాదనీ, ఇంకా ఏమీ తేలలేదు.

వచ్చి...దాదాపు ఆరునెలలు దాటింది...ఎన్నడూ, యింటివారిని తల్చుకోవడంకాని...విచారపడటంకాని లేదు: మొదట్లో ... తారకానికి కొంచెం బెదురుగానే ఉన్నది ... పోలీసు అధికార సాహాయ్యముతో, సూర్యుడి బంధువులు ఆమెను వెదుకడానికి ప్రయత్నం చేసి, అభాస చేస్తారేమోనని: కాని, వారిజాడలేదు: బహుశః యీ లోకంలో లేదేమో ననే నిర్వేదంతో ఉండి ఉంటారు.

అదివరకు ఎన్నిసార్లో సూర్యుడు అలాగని బెదిరించినమాట మనసులో మెసలుతూ ఉండే ఉంటుంది, వాళ్లకు...

కామేశంమీద...ఇంకా మనసు ఉన్నదో, మరచిపోయిందో అని, ఒకటి రెండు సార్లు గాలం విసిరిచూశాడు: మీనుపడ్డది...! అంతటితో, మరీ జాగ్రత్తగా, ఆ పేరైనా తీసుకునిరాకుండా... ఉన్నాడు: ఆలాటి సామాన్యుడికి... సూర్యుడు, ...భార్యఅయిపోయి, కళా- జీవనకోరకములను త్రుంచివేసుకోవడం, తారకానికి ...సుతరాం యిష్టములేదు. కష్టములన్నీ...వెనుకటిదంతా... ఆమె మరచిపోయి...ఆలాచేయడమే, అతని అభిమతము—

—మధ్యాహ్నము: వేసవి తీవ్రతవల్ల కొళవేర్ జాలకముల మాటున...తాపోపశమనం చేసుకుంటూ...తారకం ... సూర్యుడు, కూర్చుని ఉన్నారు. క్రమశః అతని కునికిపాట్లు...నిద్దురలోకిపోయినవి. ఆమె...ఏదో ఆలోచించుకుంటూ...కనుమూయలేదు...

ముత్తువచ్చి...ఎవరో వచ్చారని చెప్పాడు. తారకం కోసమే అయి ఉంటుంది, కాని నిద్రాభంగం చేయవలసినంత మణిగిపోయే పని ఏముంటుంది...? ఈలోపల...ఆ వచ్చిన పెద్దమనిషితో...ఎవరో ఎరుగున్నవాడే అయిఉంటాడుకదా...తాను బాతాఖానీ వేస్తూంటే...తారకం, మేలుకున్న తరువాత, వస్తాడు. సరే, కూర్చోమని.. చెప్పమని, ముత్తును పంపివేసి...అద్దందగ్గర ముంగురులు సవరించుకుని, కుంకుమ దిద్దుకుని...తాంబూల రాగవేల్లితమును పైటకొంగుతో, అంగుళివారను తుడుచుకుని...హాలులోకి...వచ్చి...ఆ వచ్చినది ఎవరో అని...అతడు, తిరిగి చూడగానే...పోల్చుకున్నది. కామేశం !

చూసిన వెంటనే... నవనిధులూ హస్తగతమైన కృపణుని మహానందము... ఆమెలో ఉబికి పోయింది. కామేశం... తన కోసం... వెదుక్కుంటూ వచ్చాడు... తనవాడు...

చేతులు జాచుకొని... అతని కౌగిలిలోపోయి వాని లే ఉద్వే గంతో...సమీపించుతున్నది ; కాని, అతనిముఖంలో, ఆనంద మేమీ గోచరించడం లేదు... పైగా ఎంతో బాధపడి... ఇంకా యాతనలో నవసి పోతూన్న... ఆర్తి... గూడుకట్టుకుని ఉన్నది...

'నిలు... నన్ను ముట్టుకోవద్దు.'

శిలామూర్తియై... నిలువమన్నచోట, నిలువ పడిపోయింది! ఎందుకు అంత కోపం...?

'నీవు_ చేసినపనికి సంతోషించాను. నాకు చాలా బాగా బుద్ధిచెప్పావు...! ఇంతకూ నిన్ననడ మెందుకు- మీజాతినైజం ఎక్కడకు పోతుంది...'

'కామేశం... !'

'నీనోటి వెంటబడి...నాపేరుకూడా నరకంలో కూలిపోతుంది: ఇన్ని ఊహలున్నదానవు...అదిఅంతా అభినయమేనా...?మీవాళ్ళు, పాపం, కష్టపెట్టారూ: నీకు, సానిలాగా నికృష్టజీవనంచేయుడం ఇష్టంలేదూ:—నేను, రక్షించాలీ...నన్ను తప్ప ఇంకొకరిని కన్నెత్తిచూడవూ...ఎన్ని నాలుకలున్నాయి...నీకు ?'

'అన్యాయపుమాటలాడకు, కామేశం—నేను అనుభవించినది చాలు...ఏజన్మాన పాపమో...! ఇంకా మనసు నొప్పించకు... నేను...నీదాననే...'

'ఛీ...ఇంకా నోరు ఏలా వస్తూందినీకు. లోకం గుడ్డిదనుకున్నావా...నీవు చేస్తూన్న ఘనకార్యం తెలుసుకోలేదనుకున్నావా?...వెన్నెలకన్నె...ఒహో !'

'ఏమిటీ ! నీవు చూశావా...ఆ చిత్రాన్ని...'

'చూచాను...సంతోషించాను...!అందువల్లనే...దేవిగారు... ఈ రాజవైభవంలో ఉన్నట్టు తెలుసుకుని...నజరానా సమర్పించు

కుందామని...వచ్చాను. ఇవిగో...అధికారులను మోసంచేసి...తలిదండ్రుల పరువు ముంచేసి...నిన్ను ఉద్ధరించుదామని దొంగతనం చేసి... ఆఫీసునుంచి ఎత్తుకువచ్చాను! పాదపూజ చేయనీ...ఊహు... అంతటితో తృప్తితీరుతుందా...మహాశక్తివి... రక్తధారలతో అభిషేకించనిదీ ఊరుకుంటావా?...కాని, ఏం చేయను...నీవు పగులగొట్టిన హృదయంలోనుంచి...ఇదివరకే నెత్తురంతా ఓడిపోయిందే... అయినా, చూడనీ...ఎక్కడన్నా ఓ చుక్క మిగిలి వున్నదేమో, దానితో సరిపెట్టుకో...'

—సూర్యుడికి ... గాభరాతో వెర్రి ఎత్తిపోయి ... అతన్ని కౌగలించుకుని...కామేశం...కామేశం...అంటూ మాటవినిపించుకోమని బ్రతిమాలుతూన్నది. ఆతడు...ఆమె స్పర్శతో...వళ్లు అగ్నిహోత్రమైపోయి...మోటగా నెట్టివేసి...ఎకసక్కెముగా-వెడనవ్వుతో...

'నీకు, కరవా...ఒళ్లు యిచ్చినవానికే కౌగిలి కూడా ఇచ్చుకో...! ఎంతసొమ్ముపోసి కొనుక్కున్నాడో...పేదవాడిని...అంతధర నేను భరించలేను.'

మాటలు, బాణాలకన్న పదును తేరినవి. సూర్యుడు, మృగరాజు పంజాదెబ్బతిన్న లేడిపిల్ల అయి తూలిపోతూ ...

'కామేశం! నేను, ఏ పాపమూ ఎరుగను ... నన్ను నమ్మవూ...' అని విలపించింది...

'నిన్ను నమ్మితే...నా కళ్లను నేను నమ్మకపోవాలి...'

'వేరు అర్థంచేసుకోవద్దు. చిత్రరచనకోసం...నేను నగ్నంగా నిలిచినమాట నిజమే - కాని, ఆయన - నన్ను పాపపుచూపులతో ఎన్నడూ చూడలేదు...సామాన్యుడా...దేవుడు...'

'—ఏ దేవుడు?' అని పునః ఉచ్చరించుతూ, తారకం... నిదురకన్నులు తెరిపికి తెచ్చుకుంటూ...అక్కడికి వచ్చాడు:

వారి యిద్దరి వైఖరీ చూసి ప్రశ్నార్థకంగా...ఆతడెవరని... సూర్యుడువంక, చూపు మళ్ళించాడు :

'ఈతను...కామేశం' అని సూర్యుడు, విధిలేక...గొంతు తెమల్చుకుని అన్నది.

తారకం ముఖంలో, ఆశ్చర్యం...దానికి అంతులేదు...

'నీవేనా మహానుభావా...నీరాకకు కలవరించిపోతున్నాం...! ఏమమ్మా సూర్యుడూ అంతేకాదూ, నీ మనసు నాకు తెలియదనున్నావేం?...నీవు, అన్నవన్నీ...విన్నానయ్యా. నిన్ను, నిజానికి, ఏం చేసినా పాపములేదు. చిన్నప్పటినుంచీ ఒక ప్రాంతంలో యీడుగాపెరిగారే ఆమె తత్త్వమే తెలుసుకోలేనివాడవు—నీవు ముందుముందు సుఖపెట్టగలవని నమ్మకం ఏలా...? అయినదానికీ కానిదానికీ శంకించే—మీకీడెంచి మేలెంచే ఛాందసం పోనిచ్చావుకాదే?... ఇష్టంవచ్చినట్టు ధిమాకీచేసి బెదరించడానికి... ఆమె ఎవరనుకున్నావు ? ...

'ఆమె చెడి పోయిందేం... అయితే ఎందుకు వెదుక్కుంటూ వచ్చావు? నీ మహాత్యాగమును ఆమె ఎదుట పొగడు కొనేందుకా? సమయానికి తోక ఝాడించి... దైవవశాత్తూ నేను కనబడకనే పోతే... ఈమె ఏమై పోయేదో ఎరుగున్నావా? ... నీవు ఉద్ధరించిన దేమిటి ? నమ్మించి తీరా వేళకు ముఖం తప్పించిన నీవుకూడా మాటాడాలి—ఇంకా—లజ్జా, అభిమానం లేక !

'ఇంతకూ... నీవు ఎన్ని నిష్ఠురము లాడి... ఆమెను నొప్పించినా... సూర్యుడికి... నీమీదనే మనసు ఉండటం... నీ అదృష్టమనుకో...! చూడు, ఆమె కనులలో ప్రేమ ఏలా కురిసి పోతూన్నదో...

'సామన్యదృష్టిలో అవినీతి అనే అజ్ఞానానికి కళాలోకంలో తావులేదని...తెలుసుకునేందుకు... సూర్యుడిదగ్గర శుశ్రూష చేయ

వలసి ఉంటుంది... నీవు: ఏమమ్మా... విద్యార్థిని ఆట్టే దండించబోకు...

'మీ... లౌకిక భావనలు... నా తపస్సును కూడా చెడగొడుతవేమో... నేను పోతున్నాను. టీ మాట మరచిపోయి... నన్ను వేధించకండి... నేను ఒంటరిగా... తాగే... అలవాటు పోయింది— కాదూ సూర్యుడూ ?...'

తారకం ... తలుపు చాటై వెళ్ళిపోతూన్న కొద్దీ ... వెన్నెల కన్నె...

—వెన్నెలలో మునక వేస్తూన్నాడు కామేశం...

* *
*